# వెండితెరపై అజరామరం




రామకథ మధురం. రామచరిత అద్భుతం. రామచంద్రుడి జీవితం ఆదర్శప్రాయం. భారతీయ ఇతిహాస గాథల్లో రామాయణానికి ఉన్న స్థానం ఉన్నతమైనది. రామాయణం నేపథ్యంలో తెరకెక్కిన సినిమాలు అజ'రామ'రం. రామాయణం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది మర్యాదాపురుషోత్తముడే. అలాంటి మహోన్నతమైన శ్రీరాముడి పాత్రలో ఒదిగిపోయి వెండితెరకు వన్నె తెచ్చిన నటులెందరో! దేశమంతా రామనామాన్ని స్మరిస్తున్న సందర్భాన వెండితెర రాములవారి గురించి ప్రత్యేక కథనం...






రామకథతో వచ్చిన తొలి సినిమా 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం'. 1932లో ఈ సినిమా విడుదలైంది. ఈ చిత్రంలో యడవల్లి సూర్యనారాయణ రాముడి పాత్రలో కనిపించారు. ఈయన రంగస్థల కళాకారుడు.. తొలితరం తెలుగు సినీ నటుడు. ఆ తర్వాత కొంత మంది రాముడి పాత్రను పోషించినా తెలుగు నాట మాత్రం రాముడు అంటే నందమూరి తారక రామారావే గుర్తుకువస్తారు. వెండితెర శ్రీరాముడిగా ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా చెరగని ముద్రను వేసుకున్నారు ఎన్టీఆర్. రాముడు అంటే ఇలాగే ఉంటాడా అన్నట్లు ఆ పాత్రలో ఇమిడిపోయారాయన. తన నటనతో నవరసాలు పండించారు. సీతాదేవి ఘట్టంలో విషాదాన్ని, రావణ సంహారంలో కోపాన్ని, మహారాజుగా శాంతాన్ని.. ఇలా సందర్భానుసారం పాత్రలో తనదైన నటకౌశలాన్ని ఒలకించి ఔరా అనిపించారు. 'సంపూర్ణ రామాయణం', 'శ్రీరామ పట్టాభిషేకం', 'రామాంజనేయ యుద్ధం' తదితర సినిమాల్లో రాముడి పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించారు ఎన్టీఆర్. ఎన్టీఆర్ తర్వాత రాముడిగా మెప్పించిన నటుడు హరనాథ్. ఎన్టీఆర్ దర్శకత్వంలోనే వచ్చిన 'సీతారామ కల్యాణం' సినిమాతోపాటు 'శ్రీరామ కథ' చిత్రంలోనూ హరనాథ్ రాముడిగా నటించారు. 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా మెప్పించిన కాంతారావు 'వీరాంజనేయ'తో పాటు పలు చిత్రాల్లో రాముడి పాత్రలో నటించారు. అయితే ఎన్టీఆర్, కాంతారావు కంటే ముందే అక్కినేని నాగేశ్వర్‌రావు 'సీతారామ జననం' సినిమాలో రాముడి పాత్రతో తెరంగేట్రం చేశారు. శ్రీరాముడిగా శోభన్‌బాబు గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఎన్టీఆర్ తర్వాత 'సంపూర్ణ రామాయణం'లో శ్రీరాముడిగా నటించారీ అలనాటి సోగ్గాడు. శోభన్‌బాబు తర్వాత బాపు దర్శకత్వంలో వచ్చిన మరో రామాయణ గాథ 'సీతా కల్యాణం'. ఈ చిత్రంలో జయప్రద సీతగా నటిస్తే మళయాల నటుడు రవి శ్రీరాముడిగా మెప్పించారు. ఉత్తరాదివారికి అయోధ్య ఎలాగో.. దక్షిణాదివారికి భద్రాచలం అంతే. ఇక భద్రాచలం నేపథ్యంలో తెరకెక్కిన ఎన్నో సినిమాలు వెండితెరను రామమయం చేశాయి. ఇదే భద్రాద్రి నేపథ్యంలో తెరకెక్కిన 'శ్రీరామదాసు' సినిమాలో సుమన్ రామచంద్రుడి పాత్రలో అలరించారు. హీరో శ్రీకాంత్ 'దేవుళ్లు' సినిమాలో శ్రీరాముడి పాత్రలో కొద్దిసేపే కనిపించినప్పటికీ మెప్పించారు. రామాయణంపై వచ్చిన మరో అద్భుత దృశ్యకావ్యం 'శ్రీరామరాజ్యం'. ఈ సినిమాలో నందమూరి బాలకృష్ణ అద్భుతంగా నటించారు. నందమూరి మూడోతరం నట వారసుడు జూనియర్ ఎన్టీఆర్. ఆయన నట జీవితాన్ని 'రామాయణం' చిత్రంలో బాల రాముడి పాత్రతో ప్రారంభించారు. ఇలా నందమూరి ఫ్యామిలీ నుంచి మూడు తరాల హీరోలు వెండితెర రాముడిగా మెప్పించడం మహాద్భుతమే. 'ఆదిపురుష్' చిత్రంలో ప్రభాస్ రాముడిగా కనిపించారు. దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించిన ఈ చిత్రం పెద్ద ఎత్తున విమర్శల పాలైనప్పటికీ ప్రభాస్‌కు తన కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర దక్కినట్లయింది. ఇలా చాలా మంది తెలుగు హీరోలు శ్రీరాముడి పాత్రలో నటించి మెప్పించారు.



## బడ్జెట్ వెయ్యి కోట్లా?





'ఆర్ఆర్ఆర్' సినిమాతో అగ్ర దర్శకుడు రాజమౌళి ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికుల హృదయాలను గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో మహేష్‌బాబుతో రాజమౌళి తెరకెక్కించబోతున్న పాన్ వరల్డ్ సినిమా విశేషాల గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మహేష్‌బాబు తొలి పాన్ ఇండియా చిత్రమిదే కావడం ఆయన అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ మొత్తం పూర్తయిందని రాజమౌళి తండ్రి, రచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రపంచాన్ని చుట్టి వచ్చే ఓ సాహస వీరుడి కథగా ఈ సినిమాను తెరకక్కించబోతున్నారని సమాచారం. జంగిల్ అడ్వెంచరస్ మూవీగా హాలీవుడ్ స్థాయి హంగులతో తీర్చిదిద్దబోతున్నారని , ఈ సినిమాకు దాదాపు 1000కోట్ల బడ్జెట్ అవుతుందని అంచనా వేసినట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్ పతాకంపై కెఎల్ నారాయణ నిర్మించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా నిర్మాణంలో మరికొందరు భాగస్వాములయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఓ దిగ్గజ ఓటీటీ సంస్థ కూడా ఈ సినిమా ప్రొడక్షన్‌లో పాలుపంచుకోవాలనే ఆలోచనతో ఉందట. అయితే ఈ వార్తలన్నీ సోషల్ మీడియా వేదికగా ప్రచారంలో ఉన్నవేనని, వీటిలో వాస్తవమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందేనని అభిమానులు అనుకుంటున్నారు. ఈ సినిమాకు సంబంధించిన వివరాలను దర్శకుడు రాజమౌళి త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.



## 'హనుమాన్' విరాళం 2.66 కోట్లు



తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'హను-మాన్' చిత్రం ఇటీవల విడుదలై చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. అయోధ్యలోని రామమందిరానికి ఈ సినిమాకు సంబంధించిన ప్రతి టికెట్ నుంచి 5 రూపాయలు విరాళంగా ఇస్తామని చిత్ర బృందం గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రీమియర్ షోల ద్వారా విక్రయించిన టికెట్ల ద్వారా లభించిన 14లక్షల 85వేల రూపాయలకుపైగా చెక్కును ఇప్పటికే అందించారు. తాజాగా ఇప్పటి వరకు విక్రయించిన మొత్తం టిక్కెట్ల నుంచి 2కోట్ల 66లక్షల మొత్తాన్ని చిత్ర బృందం అయోధ్య రామమందిరం కోసం అందించాలమని పేర్కొంది.

## రక్షణ వ్యవస్థ ఉందని మర్చిపోవద్దు

'అమ్మాయిలైనా, అబ్బాయిలైనా మీ అనుమతి లేకుండా ఫొటోలను, వీడియోలను మార్ఫింగ్ చేసి ఎక్కడైనా అశ్లీలంగా ఉపయోగిస్తే అది తప్పు. అయితే, మీకు అండగా ఓ రక్షణ వ్యవస్థ ఉందని మర్చిపోవద్దు. వారికి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్య తీసుకోబడుతుందని నేను చెప్పగలను' అంటూ సినీ నటి రష్మిక మందన్నా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 'బాధ్యులను అరెస్టు చేసినందుకు మీకు నా హృదయపూర్వక ధన్యవాదలు. నాకు మద్దతుగా నిలిచి, ప్రేమను పంచిన, రక్షించిన సమాజానికి కృతజ్ఞతలు' అంటూ డీసీపీ ఐఎఫ్ఎస్ఓకు ట్యాగ్ చేశారు. ఇందుకు ఢిల్లీ పోలీసులు స్పందించిస్తూ.. 'ఈ కేసును త్వరగా పరిష్కరించినందుకు సంతోషిస్తున్నాం. ఇలాంటి నేరాలకు వ్యతిరేకంగా గళం విప్పడానికి మహిళలను ప్రోత్సహించేలా మా చర్య ఉందని భావిస్తున్నాం. ఎప్పటికీ శాంతి, సేవ, న్యాయం అనే మా నినాదానికి మేము కట్టుబడి ఉన్నాం' అంటూ రీ పోస్టు చేశారు. తన డీప్‌ఫేక్ వీడియోకు సంబంధించి ఇన్నాండ్ల తర్వాత రష్మిక ట్విటర్ (ఎక్స్) వేదికగా పోస్టు చేయడంతో ఆమె అభిమానులు పండగ చేసుకుంటున్నారు. వీడియోలు, పోస్టులు, మీమ్స్ రూపంలో ఆమెకు అండగా ఉన్నామనే సంకేతాలు ఇచ్చారు. కాగా, రష్మిక ట్వీట్‌కు లక్షల్లో వ్యూస్ రాగా, వేలల్లో కామెంట్లు వస్తున్నాయి.




## మనసున్న సితార

సూపర్ స్టార్ మహేశ్‌బాబు కుమార్తె సితార మరోమారు సహృదయతను చాటారు. అనాథ చిన్నారుల కోసం ఆదివారం 'గుంటూరు కారం' ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయించారు. ఏఎంబీ సినిమాస్‌లో మహేశ్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ షోకు సితార హాజరై చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారితో కలిసి దిగిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా కావడంతో సితారపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఆ విషయంలో ఒత్తిడికి లోనవడం ఇష్టంలేదు




సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'కంగువా'. శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ డ్రామా ఇది. దిశా పటానీ కథానాయిక. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా విడుదల గురించి నిర్మాత ధనుంజయన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇది మా డ్రీమ్ ప్రాజెక్ట్. సినిమా పూర్తి కాక ముందే రిలీజ్ డేట్ ప్రకటించి ఒత్తిడికి గురికావడం మాకు ఇష్టం లేదు. ఇది అంతర్జాతీయ ప్రాజెక్ట్. 3డీ, సీజీ వర్క్‌కు చాలా సమయం పట్టొచ్చు. ఈ కారణంగానే రిలీజ్ డేట్‌ను మేమింకా నిర్ణయించలేదు. సూర్య పార్ట్ చిత్రీకరణ పూర్తిచేశాం. బాబీ దేవోల్‌పై షూట్ చేయాల్సినవి, మరి కొంత ప్యాచ్ వర్క్ మిగిలి ఉంది. 10 భాషల్లో థియేటర్ రిలీజ్ చేయనున్నాం. ఓటీటీ వెర్షన్ విదేశీ విదేశీ భాషల్లోనూ విడుదల చేస్తాం. ప్రస్తుతం మా దృష్టి పోస్ట్ ప్రొడక్షన్‌పై ఉంది' అన్నారు. కంగ అనే పరాక్రముడి కథతో 'కంగువా' రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపిస్తారని తెలిసింది.


## హాట్ సీన్లపై సెన్సార్ కత్తెర్లు



బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొణె సినిమా అంటే గ్లామర్ పాళ్లు ఎక్కువే ఉంటాయని భావిస్తారు సగటు యువ ప్రేక్షకులు. ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్ శుక్రవారం రాత్రి నుంచే ప్రారంభమైంది. దీపికా పదుకొణె, హృతిక్ రోషన్ నాయికానాయకులుగా బాలీవుడ్ దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కించారీ చిత్రాన్ని. ఇప్పటికే సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెకు ఇది రెండో చిత్రం. మొదటి నుంచి ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతున్న ఈ సినిమా ఏఏ అంశాల్లో సెన్సార్ ఎదుర్కొన్నదనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. హాట్ సన్నివేశాల కారణంగా భారీగానే సెన్సార్ ఎదుర్కొన్నట్లు సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ ఏరియల్ యాక్షన్ థ్రిల్లర్ సినిమా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) మొత్తం నాలుగు సవరణలు చేసినట్లు వినికిడి. ధూమపాన వ్యతిరేకంగా సందేశాన్ని పేర్కొనాలనేది మొదటి మార్పు కాగా, ఈ సినిమాలోని రెండు డైలాగుల్లో అభ్యంతరకరంగా ఉన్న పదాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో అభ్యంతరం లేని పదాలను చేర్చాలని సూచించింది. వీటితోపాటు చాలా అభ్యంతరకరంగా అర్ధనగ్నంగా ఉన్న విజువల్స్ తీసివేయాలని మరో 25 సెకన్ల ఆడియో స్థానంలో 23 సెకన్ల ఆడియో భర్తీ చేయించింది సెన్సార్ బోర్డు. ఈ మార్పులు చేసిన తర్వాతే జనవరి 19న ఫైటర్ నిర్మాతలకు యూ/ఏ సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది. సెన్సార్ సర్టిఫికెట్ ప్రకారం ఈ సినిమా నిడివి 166 నిమిషాలు.. అంటే ఫైటర్ రన్ టైం 2 గంటల 46 నిమిషాలు.

## శ్రీరాముడిపై గీతం

తేజేశ్వర్, ప్రజ్ఞ నయన్ జంటగా నటించిన చిత్రం 'మిషన్ సి 1000'. తేజేశ్వర్ దర్శకత్వం వహించారు. ఎస్.వి.క్రియేషన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నేడు అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శ్రీరాముడి నేపథ్యంలో వచ్చే పాటను విడుదల చేశారు. శ్రీధర్ ఆత్రేయ స్వరపరిచిన ఈ పాటను విజయ్‌ప్రకాష్ ఆలపించారు. జేపీ, సుధ, కబీర్‌సింగ్, సంజయ్‌పాండే, అనీష్ కురువిల్లా తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సుధాకర్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: తేజేశ్వర్.



## రవితేజతో జోడీగా...



'సప్త సాగరదాచే ఎల్లో' చిత్రం ద్వారా కన్నడంలో మంచి గుర్తింపును సంపాదించుకుంది రుక్మిణి వసంత్. తెలుగులో ఈ చిత్రం 'సప్తసాగరాలు దాటి' పేరుతో విడుదలైన ఆదరణ సొంతం చేసుకుంది. ఈ సినిమాలో రుక్మిణి అందంతో పాటు తనదైన అభినయంతో మెప్పించింది. ప్రస్తుతం ఈ భామకు కన్నడ ఇండస్ట్రీలో భారీ అవకాశాలొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ భామ తెలుగులో రవితేజ సరసన నటించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. యువ దర్శకుడు అనుదీప్ కేవీతో రవితేజ ఓ చిత్రాన్ని చేయబోతున్నారని తెలిసింది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. ఈ సినిమాలో రుక్మిణి వసంత్‌ను నాయికగా ఖరారు చేయబోతున్నారని తెలిసింది. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. ఈ సినిమాతో పాటు విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పై థ్రిల్లర్ చిత్రంలో కూడా నాయికగా రుక్మిణి వసంత్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

## 'నటరత్నాలు'లో దర్శకులకూ పాత్రలు



ఇనయ సుల్తానా, సుదర్శన్‌రెడ్డి, రంగస్థలం మహేశ్, తాగుబోతు రమేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నటరత్నాలు'. పలువు డైరెక్టర్లు కూడా ఈ సినిమాలో నటిస్తున్నారు. చందనా ప్రొడక్షన్స్ సమర్పణలో ఎవరెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన ఈ క్రైం కామెడీ థ్రిల్లర్‌కు శివనాగు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఆదివారం విడుదల చేశారు. తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర్‌ప్రసాద్, కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, దర్శకులు కేఎస్ రవికుమార్ చౌదరి, సముద్ర డీఎస్‌రావు, రామసత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శంకర్ మహదేవన్, నిర్మాతలు: చంటి యలమాటి, డాక్టర్ దివ్య, కథ-మాటలు-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: నర్రా శివనాగు.